కథ

# ఆధునికం

సాయంకాలం డాబా మీద కూర్చుని ప్రశాంతంగా గడపడమంటే ఎంతో ఇష్టం రాంబాబుకి. అస్తమయ భానుడి అరుణ కాంతిని తమకి పులుముకొని, నీలాకాశంలో సాగిపోయే మేఘశకలాన్ని, మేఘాల క్రిందుగా గుంపులు గుంపులుగా ఎగిరే పక్షుల్ని చూడడమంటే మరీ ఇష్టం. మేడమెట్ల మీదుగా సాగిన సన్న జాజి తీగ పూసిన పూవుల పరిమళాన్ని మోసుకుంటూ వచ్చే చల్లటి పిల్లగాలుల నాస్వాదించడమంటే మరీ మరీ ఇష్టం.

ఆ ఇష్టాల్ని తీర్చుకుంటూ ఆరోజు కూడా డాబామీద అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు రాంబాబు.

ఆరడుగుల పొడుగుతో..ఎత్తుకు తగిన లావుతో ..ఎర్రగా బలంగా అందంగా హుందాగా వుంటాడు రాంబాబు. విశాలమైన నుదుటిమీద పడే వంకీల జుట్టు అతనికి అమరినట్టుంటుంది. సూదంటిరాయల్లే ఆకర్షించే కళ్ళు..కవ్విస్తున్నట్టుగా కొనదేరి కోటేరేసిన ముక్కు..ఎర్రని పెదాలు, నవ్వినప్పుడల్లా తమాషాగా విచ్చుకుంటాయి. అమ్మాయిల్ని ఇట్టే ఆకట్టుకొనే అందమైన విగ్రహం..నిగ్రహం కోల్పోయేలా చేస్తుందంటే అతిశయోక్తి కాదు.

ఎమ్మే పాసై ఏదో కంపెనీలో ఎగ్జిక్యూటివ్ హోదాలో నాల్గంకెల జీతాన్ని సంపాదిస్తున్నాడు. అలాంటి బ్రహ్మాచారిని ఏ ఆడపిల్ల తండ్రి వదులుకుంటాడు. అందుకే ఎందరో అతని మీద వలలు విసురుతున్నారు. అయినా రాంబాబు ఏ వలకీ..నవలకీ చిక్కుకోకుండా చాకచక్యంగా తప్పించుకుంటున్నాడు. తల్లిదండ్రులకి ముందే చెప్పేసాడు, తన పెళ్లి విషయంలో అమ్మాయిని ఎంపిక చేసుకొనేది తనే కాబట్టి సంబంధాల వివరాలు చెప్పి చెప్పి బోరు కొట్టించవద్దని. తను మెచ్చిన..తనకి నచ్చిన అమ్మాయిని తమ కోడలుగా ఒప్పుకోడమే మీపనని.

అసలు అతని మేనమామకే ఓ అమ్మాయి వుంది. ఆమెని రాంబాబుకిచ్చి తన మేనల్లుణ్ణి అల్లుడిగా చేసుకోవాలని ఆ మేనమామకీ వుంది. ఆ మేనకోడల్ని కోడలిగా తెచ్చుకోవాలని రాంబాబు తల్లిదండ్రులకీ వుంది. ఎటొచ్చీ ఆ అమ్మాయిని భార్యగా తెచ్చుకోవాలని లేనిది రాంబాబుకే. ఎందుకంటే ఆ అమ్మాయి పుట్టి పెరిగింది పల్లెటూర్లో. ఓ మోస్తరు అందమున్నా పల్లెపట్టున చదువు సంధ్యలు సాగడంతో పెళ్ళి చేసుకున్నప్పటి నుంచీ ఆధునిక భావాలు లేని..తెలీని ఆ పిల్లని తనదారికి తెచ్చుకొనే సరికి తన వయసు కాస్తా సరిపోతుంది.

అదీ రాంబాబు భయం.

తనకి కాబోయే భార్య అందంగా వుంటేనే చాలదు. చదువుండాలి. చదువుంటేనే చాలదు మోడర్న్‌గా వుండాలి. అలంకరణలో, అలవాట్లలో, ఆలోచనల్లో ఆధునికత ఉట్టిపడాలి. ఆడ, మగ అనే భేదం లేకుండా కలివిడిగా కల్సిపోవాలి. మగవాళ్ళలా ప్యాంట్లూ, షర్టులూ, మోడర్న్ డ్రస్సులూ ధరించి చలాకీగా మాట్లాడుతూ కలుపుగోలుగా ఉండే అమ్మాయిల్ని చూస్తుంటే తనకెంతో ముచ్చటగా వుంటుంది. పెద్దవైన కళ్లను గుండ్రంగా తిప్పుకుంటూ గల గలామాట్లాడుతుంటే వాళ్ళ ముఖాల్లో కల్గే మార్పుల్ని, హావభావాల్ని చూడాలంటే మరీ సరదాగా వుంటుంది తనకి. తన మేనమామ కూతురు వసుంధర అంటే మనసులో అభిమానం లేకపోలేదు కాని, ఆ పల్లెటూరంటేనే తనకి తగని ఎలర్జీ. ఆమె అలంకరించుకొనే తీరు మరీ జుగుప్స కలిగించేలా వుంటుంది. బిగుతుగా అల్లిన జడ..చెంపల నుంచి జారే కొబ్బరినూనె..వెడల్పాటి కళ్ళకి దట్టంగా పెట్టిన కాటుక..ముఖానికి రాసుకున్న పౌడరు చెరిగీ..చెరగకుండా..ఆమె అందాన్ని పెంచడానికి బదులు మరీ అసహ్యంగా కనపడేలా చేస్తాయి.

ఆలోచనల్లో మునిగి తేలుతున్న రాంబాబు కళ్ళ ముందు ఏదో మెరుపులు మెరిసినట్టు ఫీలయ్యాడు. అందుక్కారణం..ఎదురింటి గుమ్మంలో ఆటోదిగిన అమ్మాయి. జీన్స్ ప్యాంటు మీద పెద్ద పెద్ద గళ్ళున్న షర్ట్ టక్ చేసింది. పొంగే యవ్వనగిరుల శిఖరాల్ని తాకి ధన్యత చెందాలనే కోరికతో భుజాల మీదుగా గాలి విసురుకి అల్లరిగా ఎగురుతోంది బాబ్డ్ చేసిన జుట్టు. తేనె రంగు కూలింగ్ గ్లాసెస్ ఆమె ముఖానికి నిండుగా వుంది. హాండ్‌బాగ్ లోంచి పది రూపాయల నోటు తీసి ఆటో డ్రైవర్‌కి యిచ్చి, కూలింగ్ గ్లాసెస్ తీసి చేత్తో విలాసంగా ఊపుతూ లోపలికి వెళ్ళిపోయింది.

ఒక్కసారిగా చీకటి ఆవరించినట్లన్పించింది రాంబాబుకి.

★★★

ఆఫీసుకు బయలుదేరిన రాంబాబు బస్టాపుకి వచ్చాడు.

ఎదురుగా ఆమె! ఇప్పుడు మామూలుగా చీరలో వుంది. పచ్చగా బంగారం రంగులో మెరిసే శరీరం. చలాకీగా కదిలే గుండ్రటి కళ్ళు..విల్లులా అందంగా వంగిన కనుబొమల కిందుగా! లిప్‌స్టిక్ వేయని ఎర్రని పెదాలు..మధువులూరుతున్నట్లుగా తడితడిగా మెరుస్తున్నాయి! కళ్ళు తిప్పుకోలేనంత అందంగా మబ్బురంగు చీరెలో మేఘాల మధ్య మెరిసే మెరుపులా వుంది.

బస్ కోసం వెయిట్ చేస్తున్నట్టుంది. తను రోజూ నిలుచునే చోటులో ఆమె నిలబడ్డంతో ఆమె ప్రక్కనే తనూ నిలబడ్డాడు. సభ్యతకాదని తెల్సినా..ఆమె పై నుంచి దృక్కులను మళ్ళించుకోలేకపోతున్నాడు. ఆమెను చూసినప్పట్నుంచీ తనే మెదుల్తోంది కళ్ళల్లో. తన భార్యగా వచ్చే అమ్మాయికి తను వుండాలని కోరుకుంటున్న లక్షణాలన్నీ ఆమెలో ఉన్నాయన్పిస్తోంది. అలాంటి అమ్మాయినే తన మనసు కోరుకుంటోంది.

తన ప్రక్కనే నిల్చున్న రాంబాబు వంక చూసింది ఆమె. కళ్ళు కలవడంతో దొరికిపోయిన దొంగలా ముఖం ప్రక్కకి తిప్పుకున్నాడు. అయినా మళ్ళీ ఆమె పైకే ప్రసరించాయి చూపులు. చిరుగాలికి కదలిన గులాబీలా విచ్చుకున్నాయి ఆమె పెదవులు. ఫలితంగా హృదయాలను వెర్రెత్తించే చిరునవ్వు కదలాడింది ఆ పెదాలపైన!

నిలువునా వణికిపోయింది రాంబాబు శరీరం. ఒళ్ళంతా జివ్వుమన్పించింది. ఆమె నవ్వుకు బదులుగా ఏం చెయ్యాలో తెలీలేదు. మాట పెగల్లేదు రాంబాబుకి. ''హలో! మీరు..మా ఎదురింటి వారబ్బాయి కదూ..'' ఆమే ముందుగా పలకరించింది. ''అవున''న్నట్టుగా తల ఊపాడు. ''నా పేరు లావణ్య'' అంది ఆమె. 'చక్కని పేరు. అందానికి తగినట్టుగా' అనుకున్నాడు రాంబాబు మనసులో.

''బైదిబై..మీ పేరు చెప్పనే లేదు.'' అంటూ నవ్వింది లావణ్య.

ఆమె పెదాలపై మరోసారి విరిసిన చిరునవ్వు రాంబాబు శరీరంలోని నరాలనన్నిటినీ పట్టి కుదిపి వదిలింది.

పెదాలు దాటి మాటలే రావడం లేదు ఎందుకో! ఒళ్ళంతా చిరుచెమటలు దిగజారుతున్నాయి. ''రా.. రాంబాబు'' అన్నాడు నసుగుతున్నట్టుగా. మళ్ళీ నవ్వింది లావణ్య. మరీ లావణ్యంగా!


నెమ్మదిగా మాటలు కలిపింది. పది నిమిషాలయ్యేసరికి ఆమెతో మాట్లాడ్డానికి అలవాటు పడ్డాడు రాంబాబు. మాటలమధ్య అర్ధ గంట గడిచినా బస్సు రాక పోవడంతో

''మీ ఆఫీసు స్టేట్ బాంక్ వైపేగా..నాకు బాంక్‌లో పని వుంది. ఆటోలో వెళ్దాం'' అంటూ తనే ఖాళీగా పోతున్న ఆటోని పిలిచింది లావణ్య.

★★★

ఇద్దరి మధ్యా స్నేహం బాగానే పెరిగింది. ఎదురిల్లే కావడంతో ప్రతిరోజా సాయంకాలం కల్సుకోవడం మామూలయిపోయింది. కబుర్లతో కాలం ఎంత వేగంగా సాగిపోయేదో తెలిసేది కాదు రాంబాబుకి. ఎన్నెన్నో విషయాలు దొర్లిపోతుండేవి వాళ్ళ మాటల్లో.

మాట్లాడుతున్నపుడు ఆమె ముఖంలో చిత్రంగా కదిలే చక్రాల్లాంటి కళ్లను చూస్తూ కూర్చునేవాడు రాంబాబు. ఆవేశంగా మాట్లాడుతుంటే ఎరుపెక్కిన లేగులాబి చెక్కిలిని ముద్దాడాలనే కోర్కెను బలవంతంగా ఆపుకొనేవాడు. ఆమె మాటల్లోని ఆధునిక భావాలకు ఆశ్చర్యపోయేవాడు. ఆడవాళ్ళ గురించి మాట్లాడుతుంటే మరీ ఆవేశం కన్పించేది ఆమెలో. ''ఆడవాళ్ళు మగవాళ్ళతో పోటీపడి అన్నిరంగాల్లోనూ ముందంజ వేస్తూంటే..చూసి ఓర్వలేని కొందరు అణగద్రొక్కే ప్రయత్నాలు ఈ కాలంలో కూడా చేయడం చాలా దారుణమైన విషయం. ఏం..ఏ విషయంలో మేం తక్కువ. ఇంకా చెప్పాలంటే అన్ని విషయాల్లోనూ స్త్రీలదే పై చేయనడం అబద్ధమూ కాదు..అసంబద్ధమూ కాదు.'' అలా సాగిపోయేది ఆమె వాక్ప్రవాహం. అలాగే ప్రేమ వివాహాల గురించి, పెద్దవాళ్ళ చాదస్తపుటాలోచనల గురించి, విఫలమవుతున్న సంసారాల గురించి..ఎన్నో టాపిక్స్‌పై అనర్గళంగా మాట్లాడేది. కేవలం శ్రోతగా మిలిగిపోయేవాడు తను.



మాట్లాడుతున్నపుడు ఆమె ముఖంలో చిత్రంగా కదిలే చక్రాల్లాంటి కళ్లను చూస్తూ కూర్చునేవాడు రాంబాబు. ఆవేశంగా మాట్లాడుతుంటే ఎరుపెక్కిన లేగులాబి చెక్కిలిని ముద్దాడాలనే కోర్కెను బలవంతంగా ఆపుకొనేవాడు. ఆమె మాటల్లోని ఆధునిక భావాలకు ఆశ్చర్యపోయేవాడు. ఆడవాళ్ల గురించి మాట్లాడుతుంటే మరీ ఆవేశం కన్పించేది ఆమెలో.

రోజులు గడిచే కొద్దీ ఆమె స్థానం తన మనస్సులో పదిలపడుతోంది. తను కోరుకుంటున్న అమ్మాయి ఈమె అన్పిస్తోంది. 'ఆమెని పెళ్ళి చేసుకుంటే తన జీవితం మూడుపూవులు..ఆరు కాయలుగా సాగిపోతుంది. ముందుగా మనసులోని మాట ఆమెతో చెప్పాలి. ఆ తర్వాత పెద్దల ద్వారా ముందుకెళ్ళాలి..' అనుకున్నాడు రాంబాబు.

అనుకున్నట్టుగానే ఓ రోజు తన మనసులోని

**సూరిపండు**

మాటల్ని ఆమెకి చెప్పేసాడు. అసలే వెన్నెల గనుల్లాంటి ఆమె కన్నుల్లో విద్యుల్లతల్లాంటి మెరుపులు మెరిసినట్టయింది ఒక్కక్షణం. వెంటనే సీరియస్‌గా ''మిష్టర్ రాంబాబూ..ఏదో స్నేహంగా వున్నంత మాత్రాన మీరీవిధంగా మాట్లాడ్డం బాగాలేదు. ఆడపిల్ల కాస్త చనువుగా పలకరిస్తే ప్రేమించెయ్యడమేనా. ఆమె మనసులోని భావాలేమిటో..ఆమె అభిరుచులేమిటో తెలుసుకోనక్కర

లేదా..'' అంది.

''ఏం...నాకేం తక్కువట. అందం లేదా..లక్షణమైన ఉద్యోగం లేదా..'' ఉక్రోషంగా అన్నాడు రాంబాబు. కోపంతో ఎర్రబడే అతని ముఖం వంక, అదిరే ముక్కు పుటాలవంక చూస్తూ, వచ్చే నవ్వును పెదాల మధ్య బిగపట్టుకొని ''అంతేనా..పెళ్ళి చేసుకోవడానికి మరేం అక్కర్లేదా..'' అంది లావణ్య.

''నిన్ను ప్రేమగా చూసుకొనే మనసు కూడా ఉంది'' అన్నాడు. అదే ఆవేశంతో రాంబాబు. ''ఊహూ. ఇంత కోపిష్టి మొగుడితో ఎలా వేగాలో పెళ్ళి చేసుకొని...'' అంటూ రాంబాబు ముక్కుపట్టి లాగి గబగబా మేడదిగి వెళ్లిపోయింది లావణ్య.


ఆమె మాటల భావం బోధపడి ''హుర్రే'' అంటూ ఎగిరి గంతెయ్యబోయి ఆగిపోయాడు. ఆ తర్వాత ఇద్దరూ మానసికంగా మరీ దగ్గరయ్యారు.

★★★

ఆఫీసు నించి ఇంటికి వస్తున్నాడు రాంబాబు బస్సు దిగి. బస్టాప్ దగ్గరలో ఉన్న పార్కులో ఎవరితోనో కూర్చుని మాట్లాడుతోంది లావణ్య. సిమెంటు బెంచీ మీద అతనెవరో..మరీ అంత దగ్గరగా కూర్చోవడం నచ్చలేదు ఎందుకనో రాంబాబుకి. మాట్లాడుతూ మధ్య మధ్య అతని భుజం తట్టడం అంతకన్నా నచ్చలేదు.

రాత్రి భోజనాలయినాక డాబా మీద కూర్చున్నారు లావణ్య రాంబాబు. సాయంత్రం తను చూసిన విషయం లావణ్యతో చెప్పాలనుకున్నాడు మనసులో. 'అయినా ఎలా చెప్పాలి! అసలు తనెందుకిలా ఆలోచిస్తున్నాడు. అతను ఎవరో స్నేహితుడు కావచ్చు. అతని పక్కన కూర్చొని మాట్లాడినంత మాత్రాన తనకెందుకు బాధ కల్గాలి. అలా 'మూవ్' అయ్యే అమ్మాయినే కదా తాను కోరుకొనేది.' మనసెంత సరిపెట్టుకుందామనుకున్నా ఒప్పుకోవడం లేదు. ఆమెను అడగకుండా ఉండలేకపోయాడు. ''అతనా...శేఖర్ అని నా చిన్ననాటి స్నేహితుడు. అనుకోకుండా కలిశాం. ఎవరో ఏదో అనుకుంటారని బాల్య స్నేహితులతో మాట్లాడ్డం మానెయ్యలేం కదా!'' అంది అతని వంక ఓరగా చూస్తూ లావణ్య. ''అవును. అదీ నిజమే.'' అన్నాడు ఏమనాలో తెలీక ఓ వెర్రి నవ్వు ముఖం మీదకు తెచ్చుకొని రాంబాబు.

మరో రోజు సాయంకాలం డాబా మీద తిరుగుతున్నాడు. లావణ్య కోసం ఎదురు చూస్తూ. ఎదురింటి ముందు ఓ మోటార్ బైక్ వచ్చి ఆగింది. 'అతనే..మొన్న పార్కులో చూసిన అతనే..' అనుకున్నాడు మనసులో. బైక్ మీద నుంచి దిగి ''బై..శేఖర్. మళ్ళీ కలుద్దాం'' అంటూ లోపలికి వెళ్ళిపోయింది చెయ్యి ఊపి. మనసులో ఏదో ముల్లు గుచ్చుకున్న ఫీలింగ్.




''తనదనుకున్న లావణ్య..తనకి దూరమైపోతోందిగా! ఎంత చిన్నతనపు స్నేహితుడైనా మరీ అంత చనువా!'' ఏదో అనుమానపు విష బీజం రాంబాబు మనసులో చోటు చేసుకోబోయింది.

'ఛ..తప్పుదారిలో ఆలోచిస్తున్నట్టున్నానే..' అనుకున్నాడు అంతలోనే.

''ఏయ్..రాం. ఏమిటి ఏవో ఊహల్లో తేలిపోతున్నట్టున్నావు..''

నవ్వుతూ వచ్చింది లావణ్య. ''అబ్బే..అదీ..అదీ'' తడబడ్డాడు రాంబాబు.

మనసులోని మాట చెప్పాలా..వద్దా! చెప్తే ఏమంటుందో. త్వరలో పెళ్ళి చేసుకోబోతూ పరాయి మగాడితో అంతలా రాసుకుని తిరగడం..తనకి మనసులో రంపపు కోతలా వుంది. అవే మాటలు ఆమెతో అనేశాడు. అప్పటి దాకా నవ్వుతున్న ఆమె ముఖం ఆ మాటలతో సీరియస్‌గా మారిపోయింది. నవ్వే ఆమె కళ్ళు నిప్పులు కురిపిస్తున్నట్టయిపోయాయి.

''సీ మిష్టర్ రాంబాబు! ఆడపిల్లనయినంత మాత్రాన..పెళ్ళి కాబోతున్నంత మాత్రాన మరో మగవాడితో కల్సి తిరిగితే ఇంత నీచంగా మాట్లాడాలా! నువ్వూ పరాయి మగవాడివేగా..మనకి పెళ్ళి కానంతవరకూ! సంకుచిత భావాలతో మసలే మనుష్యులంటే నాకసహ్యం. సంస్కారం లేని నీతో మనుగడ సాగించడం నరకానికి ప్రయాణించడమే. పెళ్ళికి ముందుగానే నీ మనసేమిటో తెలిపినందుకు చాలా థాంక్స్ గుడ్‌బై.'' అంటూ విసురుగా మేడ మెట్లు దిగి వెళ్ళిపోయింది లావణ్య వెనుక నుంచి రాంబాబు పిలుస్తున్నా విన్పించుకోకుండా.




అచేతనంగా నిలబడిపోయాడు రాంబాబు. ఆమె వెళ్ళిపోవడం బాధగానే వుంది. అయినా ఏదో 'ఈజీనెస్'గానూ వుంది. 'నిజమే. ఆమె అన్నట్టు మనసులో అనుమాన పిశాచాలతో సంఘర్షణ పడేకన్న విడిపోవడమే మంచిది. తన ఆలోచనల్లోనే ఆధునికత చోటు చేసుకుంది గానీ అంతరంగంలో పూర్తిగా మార్పు జరగలేదు.' ఆ నిజాన్ని జీర్ణించుకోలేక ఏనాడో పదేళ్ళ క్రితం చూసిన మేనమామ కూతుర్ని గుర్తుతెచ్చుకుంటూ బయల్దేరాడా పల్లెటూరికి.

★★★

రాంబాబు బస్సు దిగేసరికి ఎదురుగా మేనమామ కన్పించాడు. ''రావోయ్ అల్లుడూ!'' అంటూ ఆప్యాయంగా పలకరించాడు. కబుర్లాడుకుంటూ ఇంటికి వచ్చారు. గుమ్మంలో అడుగుపెడుతూనే ''అమ్మాయ్..ఎవరొచ్చారో చూడు'' అంటూ కేకపెట్టాడు రాంబాబు మామయ్య. లోపల్నుంచి వచ్చిన అమ్మాయిని చూస్తూనే శిలా ప్రతిమలా నిలబడిపోయాడు రాంబాబు. కొద్ది క్షణాల్లో తేరుకొని ''లావణ్యా..నువ్వు..ఇక్కడ నువ్వేనా'' తడబడుతూ అతడిగాడు. ''అవును బావా నేనే..'' అంటూ ఎదురొచ్చి చేతిలో సూట్‌కేస్ అందుకుంది.

''అవునోయ్ అల్లుడు. మా అమ్మాయి వసుంధరే ఆ లావణ్య. నువ్వు పెళ్ళి చేసుకోనంటున్నావని...కాబోయే భార్య ఎలా వుండాలనుకుంటున్నావో అలానే తయారై మీ ఇంటి ఎదురుగానే మకాం పెట్టింది. ఆ ఇంటివాళ్ళు మా ఊరునుంచే వచ్చార్లే. అప్పుడప్పుడు వాళ్ళ పెద్దమ్మ గారి అబ్బాయి శేఖర్ వచ్చి చూస్తుండేవాడు. అసలీ ప్లాని చ్చింది వాడే. ''మావయ్య కూతుర్నే చేసుకుంటాను'' అని నువ్వొక్కడికి వచ్చేలా చేస్తాను అని శపథం చేసి మరీ వచ్చింది మీ ఊరు. అమ్మాయ్..బావని లోపలికి తీసుకు వెళ్ళు. నేనలా పంతులుగారింటి దాకా వెళ్ళొస్తాను. ముహూర్తాలెప్పుడున్నాయో..'' అంటూ బయటకి వెళ్ళిపోయాడు రాంబాబు మేనమామ.

''రా బావా..'' అంటూ లోపలికి నడవబోయింది వసుంధర.

''అవ న్నుదొంగా..ఇంత నాటకమా..నిన్నూ'' అంటూ ఆమెను పట్టుకోబోయాడు. ''అబ్బా..ఆశ'' అంటూ లోనికి పరుగెత్తింది వసుంధర. ఆమె వెనుకనే రాంబాబు.

★